దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజావాణి అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మార్చి 4: వివిధ సమస్యలపై బాధితులు ప్రజావాణిలో అందించే అర్జీలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రజాపాలన, ప్రజావాణి అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యలపై వారం రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు. మొత్తం 429 మంది నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని సంబంధితాధికారులకు పరిష్కారం కోసం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో కే మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత స్టాల్ పరిశీలన

కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల విక్రయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, ప్రతి సోమవారం చేనేత స్టాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టాల్‌ను పరిశీలించిన వారిలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, చేనేత జౌళి శాఖ ఏడీ హరిచరణ్, జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి తదితరులు ఉన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రానివ్వం

- మేయర్ సునీల్‌రావు
- 4వ డివిజన్‌లో రూ.16 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభం

4వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం పరిసరాలను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు తదితరులు

కార్పొరేషన్, మార్చి 4: కరీంనగర్‌లో ఎక్కడా కూడా వేసవిలో నీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. ప్రజలు నమ్మకంతో తమ పాలకవర్గానికి అవకాశం కల్పించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తామన్నారు. సోమవారం నగరంలోని 4వ డివిజన్‌లో రూ.16 లక్షలతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గతంలో ఖాన్‌పుర అభివృద్ధికి చాలా దూరంగా ఉండేదని, కానీ తమ పాలకవర్గం హయాంలో అనేక నిధులు కేటాయించి స్థానిక ప్రజలకు సౌకర్యాలు మెరుగుపర్చామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేశామని, పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులను కూడా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని తెలిపారు. కరీంనగర్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత వేసవిలో మానేరు డ్యాంలో 13 టీఎంసీల నీరు నిలువ ఉండేదని, ఇప్పుడు ఎనిమిది టీఎంసీలకు పడిపోయిందన్నారు. దీంతో నీటి సరఫరాలో కొంత ప్రెషర్ తగ్గిందని, అయినా కూడా ముందస్తు ప్రణాళిక రూపొందించి ఎక్కడ కూడా నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వచ్చే వారంలోగా దీనికి సంబంధించిన పనులు పూర్తి చేసి, వేసవికాలంలో ప్రజలకు ప్రతి రోజూ నీటి సరఫరా చేస్తామని వెల్లడించారు. టెండర్లు పూర్తయిన అభివృద్ధి పనులను వేసవిలోగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నుజహత్ ఫర్వీన్ అలీ, కంసాల శ్రీనివాస్, నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ బంపర్ లక్కీడ్రా' విజేతల ఎంపిక

తెలంగాణచౌక్, మార్చి 4: దసరా పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ నిర్వహించిన బంపర్ లక్కీ డ్రా స్కీమ్ విజేతలను సోమవారం బస్టాండ్‌లోని సమావేశ మందిరంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ సమక్షంలో ఎంపిక చేశారు. డ్రా ద్వారా పది మందిని ఎంపిక చేసి, టికెట్ మీద రాసిన వివరాల ఆధారంగా విజేతలకు సమాచారం అందజేశారు. వారికి రూ.పది వేల చొప్పున నగదు బహుమతిని హైదరాబాద్‌లోని బస్‌భవనంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నట్లు ఆర్ఎం సుచరిత తెలిపారు. కార్యక్రమంలో డీఎంలు మల్లేశం, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

చొప్పదండి, మార్చి 4: రుక్మాపూర్, భూపాలపట్నం, వెదురు గట్ట, చాకుంట గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, మోడల్ స్కూల్, కేజీబీవీ, ఉన్నత పాఠశాలల్లో సోమవారం పీఆర్టీయూ తెలంగాణ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తున్నదని తెలిపారు. సంఘం మండల నాయకులు ఇనుగుర్తి సత్యనారాయణ, కోల రమేశ్, రామడుగు మండలాధ్యక్షుడు చొక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

తెలంగాణచౌక్, మార్చి 4: దీర్ఘకాలంగా పెండింగ్‌లో టీఎస్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి సోమవారం సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌కు పంపించిన లేఖలో కోరారు. చట్టబద్ధత లేని వెల్ఫేర్ కమిటీలను పెట్టి కార్మికులపై ఉక్కుపాదం మోపుతున్నారని అందులో ఆరోపించారు. మోటార్ వెకిల్ యాక్ట్‌కు విరుద్ధంగా కార్మికులతో పనిచేయిస్తుండడంతో ఒత్తిడి తట్టుకోలేక డ్రైవర్లు స్టీరింగ్ పైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఆర్టీసీలో వివిధ కన్సల్టెన్సీల ద్వారా నియమించిన ఒప్పంద ఉద్యోగులను తొలగించాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను చెల్లించాలని కోరారు. లేకపోతే దశ వారీగా పోరాటాలు చేస్తామని లేఖలో పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్/ సైదాపూర్, మార్చి 4: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఫోరం మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె నగరంలోని ప్రెస్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకురాళ్లు మాధవి, సునీతారెడ్డి, శైలజ, లత, కవిత పాల్గొన్నారు. అలాగే సైదాపూర్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి, సైదాపూర్ మండలాధ్యక్షుడు వస్తాదుల సదానందం మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి సమావేశానికి ఉద్యమకారులందరూ తరలిరావాలని కోరారు.

వెంకన్న ఆలయ హుండీ ఆదాయం రూ.14 లక్షలు

హుండీ లెక్కింపులో పాల్గొన్న గోవిందపతి సేవకులు

కమాన్‌చౌరస్తా, మార్చి 4 : జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీల ద్వారా రూ. 14, 35, 275 వచ్చినట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న పేర్కొన్నారు. సోమవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్ ఆధ్వర్యంలో ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ఆరు నెలలకు గానూ, బ్రహ్మోత్సవాలతో కలుపుకొని రూ. 14,35,275 ఆదాయంతో పాటు, ముడి వెండి, ముడి బంగారం సమకూరినట్లు వెల్లడించారు. నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, కిరణ్, గోవిందపతి సేవకులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మార్చి 4: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్ శాఖల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆంగ్లమాధ్యమంలో ఒకటో తరగతి ప్రవేశాల కోసం జిల్లాలోని షెడ్యూల్డ్ తెగల బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి డీ జనార్దన్ తెలిపారు. 2017 జూన్ నుంచి 2018 మే మధ్యలో జన్మించిన బాలబాలికలు మాత్రమే అర్హులని వెల్లడించారు. తల్లిదండ్రుల ఆదాయం అర్బన్ ప్రాంతంలో అయితే రూ.2 లక్షలు, రూరల్ ప్రాంతంలో అయితే రూ.1.50 లక్షలు మించరాదని, ఒక కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని పేర్కొన్నారు. ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు సంబంధిత మండల తహసీల్దార్ నుంచి తేవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 11లోగా కార్యాలయ పనివేళల్లో కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో గల గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు. జిల్లాలో ఆరు కన్నా ఎక్కువ దరఖాస్తులు వస్తే 14న డీటీడబ్ల్యూవో కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక నిర్వహించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు ఉండొద్దు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

- అధికారులు చిత్తశుద్ధితో పనులు చేయాలి
- తిమ్మాపూర్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే

తిమ్మాపూర్, మార్చి 4: వేసవికాలం సమీపించినందున మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారులు అన్ని గ్రామాల్లో తిరుగుతూ తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మిషన్ భగీరథ అధికారుల తీరుపై పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని పూర్తిగా తొలగించి, ఈ నెల11 నుంచి ఇందిరమ్మ పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తాం

తిమ్మాపూర్ రూరల్, మార్చి 4: కొత్తపల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ తిమ్మాపూర్ మండల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ ప్రభుత్వ హయాంలో ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తామన్నారు. రైతుల బాధలు తమ ప్రభుత్వానికి తెలుసని, తప్పకుండా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

'ప్రజాపాలన' సహాయ కేంద్రాలకు జన తాకిడి

కార్పొరేషన్, మార్చి 4: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా లబ్ధిదారుల ఇబ్బందులు తీర్చేందుకు గానూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సహాయ కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంతోపాటు నగరంలోని కశ్మీర్‌గడ్డ ఈ సేవా కేంద్రం, చైతన్యపురి ఈ సేవా కేంద్రం, తీగలగుట్టపల్లిలోని నగరపాలక సంస్థ కార్యాలయం, రేకుర్తిలోని కార్యాలయం, సప్తగిరి కాలనీలోని ప్రభుత్వ స్కూల్, అల్గునూర్ కార్యాలయం, కార్ఖానాగడ్డలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేస్తూ నగర కమిషనర్ శ్రీనివాస్ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా బల్దియా పౌరసేవా కేంద్ర భవనంలోని మొదటి అంతస్తులో మూడు కౌంటర్లను ఏర్పాటు చేయగా, సోమవారం పెద్ద సంఖ్యలో నగరవాసులు ప్రజాపాలన సహాయ కేంద్రానికి చేరుకున్నారు. తమకు రేషన్‌కార్డు ఉన్నా ఫ్రీ కరెంట్ పథకం వర్తించడం లేదంటూ అనేక మంది అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా, స్పందించిన ఉన్నతాధికారులు కౌంటర్లల్లో మరోసారి దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. వాటిని ఆన్‌లైన్‌లో పరిశీలించి నమోదు చేస్తామని తెలిపారు. కాగా, అర్హత ఉన్నా జీరో బిల్లు రాకపోవడంపై అటు విద్యుత్ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

'ధరణి' పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

కలెక్టరేట్, మార్చి 4 : ధరణి పెండింగ్ కేసులను తహసీల్దార్లు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ధరణి పెండింగ్ కేసులపై జిల్లాలోని తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి పెండింగ్ కేసులను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి తహసీల్దార్లందరూ హాజరుకావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, డీపీవో రవీందర్, ఆర్డీవో కే మహేశ్వర్, వివిధ మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచిన హెల్పింగ్ హ్యాండ్స్

వీణవంక, మార్చి 4: హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన దుకిరె రాజు (35) రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందడంతో అతడి కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబానికి సహాయం అందించాలనే ఉద్దేశంతో అదే గ్రామానికి చెందిన యువకుడు కర్ణకంటి భాస్కర్‌రెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయగా, హిమ్మత్‌నగర్ గ్రామంతో పాటు మండలానికి చెందిన పలువురు స్పందించి రూ.2 లక్షలు విరాళాలు అందజేశారు. వాటిని రాజు కూతురు అర్చన పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సోమవారం బాండ్ పేపర్‌ను రాజు భార్యకు స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి అందజేశారు. విరాళాలు అందజేసిన ప్రతి ఒక్కరికీ భాస్కర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలకు స్పందన

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పాఠశాల డైరెక్టర్

కొత్తపల్లి, మార్చి 4 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బాలుర జట్టు ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ మైదానంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో కరీంనగర్, గోపాల్‌రావుపేట, రామడుగు, కోరుట్ల, మల్యాల, జమ్మికుంట, గంగాధర, ముస్తాబాద్, హుస్నాబాద్, గుళ్లకోట నుంచి సుమారు 250 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. అకాడమిక్ హైస్కూల్ డైరెక్టర్ శిరీష క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఇందులో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, హ్యాండ్‌బాల్ ప్రతినిధులు ఎన్ ప్రభాకర్, ఎం వెంకటేశ్, పీ సురేందర్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన

వీణవంక, మార్చి 4: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీరామచంద్ర కాంస్య పతకం, బబ్బూరి తిరుమల్ కుమార్ వెండి పతకం సాధించగా, సోమవారం హైదరాబాద్‌లో వారికి తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మెడల్స్ అందజేశారు. జిల్లా కోచ్ రవీందర్ రెడ్డితో పాటు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ బావు సంపత్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తాచాటడంపై హర్షం వ్యక్తం చేశారు.

రెండో రోజు పల్స్ పోలియో

కొత్తపల్లి, మార్చి 4: మండలంలోని చింతకుంట గ్రామం శాంతినగర్‌లో సోమవారం రెండోరోజు పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్ ప్రారంభించారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎన్ఆర్ఐ చేయూత

మానకొండూర్ రూరల్, మార్చి 4: పచ్చునూర్ (యాదవనగర్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి స్థానిక ఎన్ఆర్ఐ రొంటాల లక్ష్మారెడ్డి కుమారుడు రొంటాల సందీప్ రెడ్డి చేయూతనందించారు. సోమవారం రూ.30 వేల విలువైన చెక్కును ప్రధానోపాధ్యాయిని శ్రీదేవికి అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సాయం అందజేసినందుకు సందీప్ రెడ్డిని హెచ్ఎంతో పాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపు మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

మానకొండూర్ రూరల్, మార్చి 4: మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాల్లో సోమవారం వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాన్ని మాజీ సర్పంచ్ బొట్ల కిషన్ ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఏడు రోజుల పాటు కొనసాగే శిబిరానికి సంబంధించిన ప్రణాళికలను కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు ఇస్తారా.. లేదా?'

మేడి అంజయ్యను అడ్డుకుంటున్న పోలీసులు

తిమ్మాపూర్, మార్చి 4: తాము పదవిలో ఉన్నప్పుడు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు ఇస్తారా.. లేదా..? అంటూ మన్నెంపల్లి మాజీ సర్పంచ్ మేడి అంజయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సత్యనారాయణను కలిసి తమ సమస్యను విన్నవించుకుంటానంటూ లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా, సీఐ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. బిల్లులు చెల్లించకపోతే తమకు ఆత్మహత్య శరణ్యమని అంజయ్య హెచ్చరించారు. అనంతరం ఆయనను సముదాయించి పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

ప్రజాపాలన సహాయ కేంద్రాల ప్రారంభం

సైదాపూర్/ చొప్పదండి, మార్చి4: సైదాపూర్ తహసీల్ కార్యాలయంలో ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని సోమవారం ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ మంజుల, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. చొప్పదండి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని చైర్‌పర్సన్ గుర్రం నీరజ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కౌన్సిలర్లు కొట్టె అశోక్, మాడూరి శ్రీనివాస్, కొత్తూరి మహేశ్, కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వశక్తి సంఘాల సమాఖ్య మహాసభ


ముందస్తు మహిళా దినోత్సవ సంబురాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, మెప్మా నేతలు

హుజూరాబాద్‌టౌన్, మార్చి 4: హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ స్వశక్తి సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక హాజరయ్యారు. ముందస్తు మహిళా దినోత్సవ సంబురాలు కేక్ కట్ చేసి నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజారామ్మోహన్ రాయ్, మహాసభ అధ్యక్షురాలు జీ కల్యాణి, డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానస, ఉపాధ్యక్షురాలు ఎస్ సుజాత, కార్యదర్శి బీ సరస్వతి, ఉప కార్యదర్శి ఎస్ పావని, సీఎల్ఆర్‌పీలు రమాదేవి, స్వరూప, టీఎల్ఎఫ్ ఆర్పీ అనూష, ఆర్‌పీలు, ఓబీలు, సీఏలు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్యం మరింత మెరుగుపరచాలి

కార్పొరేషన్, మార్చి 4 : నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు పారిశుధ్య సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని నగర కమిషనర్ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశ మందిరంలో పారిశుధ్య సిబ్బంది, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో వందశాతం ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరుగాలన్నారు. తడి, పొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నిషేధం, నైట్ స్వీపింగ్ పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. డీఆర్‌సీసీ కేంద్రాలు పూర్తి స్థాయిలో పని చేయాలని, దీని కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రతి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పరిధిలో ఒక్క డివిజన్‌ను బెస్ట్ పారిశుధ్య డివిజన్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. నిషేధిత ప్లాస్టిక్‌పై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో శానిటరి విభాగం అధికారి స్వామి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమగా అనువాద ప్రక్రియ

మాట్లాడుతున్న వారాల ఆనంద్

కమాన్‌చౌరస్తా, మార్చి 4 : వర్తమాన ప్రపంచీకరణ నేపథ్యంలో దేశాల నడుమ, భాషల మధ్య దూరం తగ్గి అనువాద ప్రక్రియ ఒక పరిశ్రమగా మారిందని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీలో సోమవారం జరిగిన జాతీయస్థాయి సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అనుసృజన స్థాయి అనువాదం అనేక రంగాల్లో ప్రాధాన్యతను సంతరించుకుందని, యువత కనీసం రెండు భాషల్లో నైపుణ్యం సాధిస్తే, వృత్తి అనువాదకులుగా నిలదొక్కుకోవచ్చన్నారు. సెమినార్లో ఆచార్య వీ కృష్ణ, ఆచార్య అరుణ కుమారి, ఆచార్య అజీజ్ బానో, ఆచార్య రత్నాకర్, ఆచార్య శేషుబాబు, ఆచార్య భీంసింగ్, ఆచార్య పార్వతి, అనూరాధపాండే, ఆచార్య మాణిక్యాంబ, హిందీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఏఎఫ్ బలగాల ఫ్లాగ్ మార్చ్

రాంనగర్/ చొప్పదండి, మార్చి 4: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫెమిలైజేషన్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా కరీంనగర్‌కు చేరుకున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో సోమవారం కరీంనగర్ రూరల్ డివిజన్‌లోని మొగ్దుంపూర్, చొప్పదండి, రామడుగు మండల కేంద్రాల్లోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అడిషనల్ కమాండెంట్ బిస్వ రంజన్ సాహు, రూరల్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు ప్రదీప్ కుమార్, ప్రకాశ్‌గౌడ్ (చొప్పదండి) రవి రోషన్ (ఆర్ఏఎఫ్) లలితగోప్ నారాయణ్ (ఆర్ఏఎఫ్), సురేశ్ (ఆర్ఐ అడ్మిన్) ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లస్మన్నపల్లిలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

సైదాపూర్, మార్చి 4: లస్మన్నపల్లిలో ఉపాధిహామీ పథకం నిధులు రూ. 5లక్షలు, ఎంపీపీ నిధులు రూ.3లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

సైదాపూర్, మార్చి 4: మండలకేంద్రంలోని వెన్కేపల్లి వీర్లబండ వద్ద మంగళవారం ఉదయం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ హాజరవుతారని జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు, ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, సింగిల్‌విండో చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకటరెడ్డి, మండలప్రధాన కార్యదర్శి చెల్మల రాజేశ్వర్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కరాటే జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొల్లి ఐలయ్య

రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఐలయ్య

చిగురుమామిడి, మార్చి 4: కరాటే ఇండియన్ ఆర్గనైజేషన్ అనుబంధ సంస్థ తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా కరాటే స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శిగా చిగురుమామిడి మండలానికి చెందిన బొల్లి ఐలయ్య మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ సుదర్శన్, శంకర్ గౌడ్, రమేశ్ హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా యాలాల మల్లన్న జాతర

చిగురుమామిడి, మార్చి4: ఇందుర్తి గ్రామంలో యాలాల మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారులు మల్లన్న సన్నిధిలో పట్నాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని వసతులు కల్పించారు.

11న జాతర దుకాణాలకు టెండర్

తిమ్మాపూర్, మార్చి 4: నల్లగొండలోని సీతారామ లక్ష్మీనరసింహ స్వామివారి జాతర సందర్భంగా దుకాణాలకు ఈ నెల 11న వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునేందుకు రూ. 50వేలు, లడ్డూ, పులిహోర విక్రయాలకు రూ. 50వేలు, ఇతర దుకాణాలకు రూ. 10వేల ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 11న ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు. టెండర్లలో దుకాణాలు దక్కించుకున్న వారు ఈ నెల 16 నుంచి 30 వరకు వాటిని నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు.

గౌడ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

హుజూరాబాద్‌టౌన్, మార్చి 4: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సన్మానం కోసం ఈ నెల 10న కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన గౌడ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా గౌడ సంఘాల ఐక్యవేదిక నాయకులు నేరెళ్ల మహేందర్‌గౌడ్, పంజాల రామ్ శంకర్‌గౌడ్ కోరారు. సోమవారం పట్టణంలో గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు రమేశ్‌గౌడ్, చందుగౌడ్, కుర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'దళిత బంధు'వుల రౌండ్ టేబుల్ సమావేశం

జమ్మికుంట, మార్చి 4: పట్టణంలో దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజకవర్గంలోని రెండో విడుత డబ్బులు విడుదల కాని దళిత బంధు పథకం లబ్ధిదారుల కోసం రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా నాయకులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండో విడుత డబ్బులవిడుదల కోసం అనుసరించాల్సిన విధానాలపై మాట్లాడారు. దళిత బంధు సకాలంలో వచ్చేందుకు దళితులంతా ఐక్యతతో ముందుకు సాగాలని, జాతి అభ్యున్నతికి పాటు పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు సంపత్, బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, మహిళా రాష్ట్ర కన్వీనర్ శిరీష, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శులు రాజేశ్ ఠాకూర్, రాజు, 57 ఉప కులాల జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు సారయ్య, శ్రీనివాస్, రమేశ్, రాంబాబు, రాకేశ్, దళిత బంధు సాధన సమితి నాయకులు సురేశ్, రాజేశ్, నరేశ్, రాకేశ్, ఆకాశ్, నాగరాజు, రక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు


రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కొత్తపల్లి, మార్చి 4 : కరీంనగర్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని డైనమిక్ జిమ్‌లో జిల్లాస్థాయి పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో బాలుర విభాగంలో వై గణేశ్, టీ విశాల్, ఎన్ రాజేశ్, వీ వివేక్, డీ వినయ్, టీ మధుకర్, టీ నవీన్, చంద్రబాబు, చంద్రమౌళి, బాలికల విభాగంలో సిరిచందన, మాధురి, డీ శ్రీలత ప్రతిభ చూపి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే క్లాసిక్ చాంపియన్‌షిప్-2024 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ దామోదర్, ఏ నాగరాజు, మల్లేశ్ పేర్కొన్నారు.